క్లుప్తంగా

డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జి.జనార్దననాయుడు గురువారం తెలిపారు. ఈ నెల 19 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్టు పేర్కొన్నారు. మొత్తం 230 సీట్లు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. విద్యార్థులు కళాశాలలో చేరి ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దిశ యాప్‌పై అవగాహన



బస్టాండ్ కూడలిలో దిశ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

కురుపాం: దిశ యాప్‌పై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కురుపాం ఎస్‌ఐ సి.హెచ్.ప్రసాద్ సూచించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో గిరిజనులకు దిశ యాప్ వలన కలిగే ప్రయోజనం, ఏ విధంగా వినియోగించుకోవాలి, ఏ పరిస్థితిలో యాప్‌ను వినియోగించాలన్న దానిపై గురువారం వివరించారు. ప్రతీ ఒక్కరు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అవగాహనలో కురుపాం పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుకలు పంపిణీ



విద్యాకానుకలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ ఆదిలక్ష్మి

సీతంపేట: మండలంలోని పెద్దూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జగనన్న విద్యాకానుకలను సర్పంచ్ హెచ్.ఆదిలక్ష్మి చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. బ్యాగ్, యూనిఫాం, దుస్తులు, బెల్టు, పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రతీ విద్యార్థి వీటిని వినియోగించుకుని బాగా చదువుకోవాలని సర్పంచ్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రసాదరావు, ఉపాధ్యాయుడు నెల్లి సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు సహకరించాలి



సర్వేకు సంబంధించిన సర్క్యులర్‌ను అందజేస్తున్న డాక్టర్ సాగర్‌వర్మ

గరుగుబిల్లి: ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందించేందుకు నిర్వహిస్తున్న ఎన్‌సీడీ సర్వేకు ప్రజలు సహకరించాలని ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో వైద్యసిబ్బంది, వెలుగు సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి కె.సాగర్ వర్మ మాట్లాడుతూ ఈ నెల 16, 17 తేదీల్లో గ్రామాల్లో ఎన్‌సీడీ సర్వేను నిర్వహించడం జరుగుతుందన్నారు. సిబ్బంది సర్వేకు వచ్చినపుడు పూర్తి వివరాలను ఇవ్వాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులపై సమాచారాన్ని ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా ఎన్‌సీడీ సర్వేకు సంబంధించి విధి విధానాల సర్క్యులర్‌ను డాక్టర్ వర్మ అందించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం అప్పలనాయుడు, సిబ్బంది శర్మ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం సక్సెస్



రోగులకు చికిత్స చేస్తున్న వైద్యాధికారి కల్యాణ్ చక్రవర్తి

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీకాకుళం జిల్లా రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. ఉచిత మెగా వైద్య శిబిరంలో రాగోలు జెమ్స్ ఆస్పత్రికి చెందిన వైద్యులు కార్డియాలజిస్ట్ డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, డాక్టర్ శిరీష డాక్టర్ రాజేష్‌లతో పాటు కంటి వైద్య నిపుణులు తనిఖీలు నిర్వహించారు. శిబిరంలో దాదాపు 200 మందికి తనిఖీలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులను అందజేశారు. ఇందులో ఆపరేషన్లకు గుర్తించిన వారిని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో ఆపరేషన్లు చేయడం జరుగుతుందని అసిస్టెంట్ మేనేజర్ పి.రాజేశ్వరరావు ఏరియా మేనేజర్ కె.రమేష్ తెలిపారు. ఉచిత మెగా వైద్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్, మండల వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు కలిశెట్టి ఇందుమతి, ఎంపీటీసీ సభ్యులు దేవాతి నారాయణమ్మ, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దేవాతి జోజి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్‌ఓ అరసాడ రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

● ఎమ్మెల్యే కురుపాం పుష్పశ్రీవాణి



నియోజకవర్గ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రసంశా పత్రాలు, నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కురుపాం: ప్రతీ పేద విద్యార్థి ఉన్నత ఉన్నత చదువులు చదవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి జగనన్న ఆణిముత్యాల సత్కార కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి మాట్లాడుతూ గత ప్రభుత్వాల పాలనలో ఎన్నడూ లేని విధంగా విద్యకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యతనిచ్చారన్నారు. చదువుకోవలన్న తపన ఉన్నా ఆర్థిక ఇబ్బందులు కారణంగా నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత చదువులు చదవలేక ఇంటికే పరిమితమవుతున్న తరుణంలో అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, విద్యా దీవెన, గోరుముద్ద పథకాలతో పాటు నాడు – నేడు కింద వేల సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలను మార్పు చేశారన్నారు. కార్పొరేటు విద్యకు దీటుగా ప్రభుత్వ విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించి పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలను రాబట్టేలా ప్రణాళికలను రూపొందించారన్నారు. ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు నాణ్యమైన విద్య, పాఠ్య పుస్తకాలు, వసతి, భోజన సదుపాయం కల్పించారన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందించిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవటం ద్వారా 2022 – 23 విద్యా సంవత్సరాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారని చెప్పారు. అనంతరం టెన్త్ ఫలితాల్లో నియోజకర్గ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించిన కర్రి తనుశ్రీ (585), బడే శివకేశవనాయుడు (581), నల్లా వెంకటనాయుడు(577)లకు, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన గంట్యాడ కీర్తి (961), కుప్పిలి ఇందు(957), ఎ.నందిని(862)లకు నగదు, దుశ్శాలువాలు, ప్రశంసాపత్రాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కురుపాం గ్రామ సర్పంచ్ గార్ల సుజాత, ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటిసి గొర్లి సుజాత, ఎంపీటీసీలు గొడు సంతోషి, టి.వి.ఎస్.స్వామియాజులు, వెలమల బంగారునాయుడు, కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్తకోట సురేష్‌కుమార్, కళింగ వైశ్య సంఘం అధ్యక్షుడు అంధవరపు కోటేశ్వరరావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ కమిటీ చైర్మన్ రాయిపిల్లి శ్రీనివాసరావు, మండల కన్వీనర్ ఇంటికుప్పల గౌరీశంకరరావు, ఐదు మండలాలకు చెందిన మండల విద్యా శాఖాధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే భూసర్వే



సర్వేలో అధికారులకు వివరాలు అందిస్తున్న భూ హక్కుదారులు, రైతులు

పాలకొండ రూరల్: పట్టణ పరిధిలో జరుగుతన్న సమగ్ర భూ సర్వే కార్యక్రమానికి భూ యజమానులు, హక్కుదారులు, రైతులు సహకరించి, సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు అన్నారు. పట్టణ శివారు ప్రాంతంలో గురువారం చేపట్టిన సర్వే కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. సర్వే జరుగుతన్న తీరు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సకాలంలో ఈ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. రీ సర్వే వివరాలను సంబంధిత భూ యజమానులు, రైతులు సమక్షంలో నమోదు చేయించారు. అధికారులు ముందుగా అందిస్తున్న సమాచారం మేరకు హక్కుదారులు పూర్తి వివరాలతో నిర్దేశిత భూముల వద్దకు చేరుకుని సహకరించాలన్నారు. శుక్రవారం ప్రత్యేక బృందాలు పట్టణంలోని సర్వే నంబర్ 30 నుంచి 39 మధ్య గల భూముల్లో సర్వే చేపడతారని తెలిపారు. కార్యక్రమంలో మొబైల్ డీటీ పి.సన్యాసిరావు, మండల సర్వేయర్ పి.వెంకటరావు, వీఆర్వో బలివాడ సాయి శ్రీనివాస్, రామారావు, సహాయ సర్వేయర్లు నాగరాజు, మణి తదితరులు పాల్గొన్నారు.

రైతు పక్షపాతి జగనన్న



చిన్నదిమిలిలో రైతులకు విత్తనాలు అందిస్తున్న చిరంజీవులు,ధర్మారావులు

భామిని: రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న రైతు సంక్షేమానికి కట్టుబడి పని చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కొవ్వాడ చిరంజీవులు, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు అన్నారు. మండలం చిన్నదిమిలి రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు ఖరీఫ్ వరి విత్తనాలు గురువారం అందజేశారు. రైతు బాంధవుడు డాక్టర్ వైఎస్సార్ తనయుడుగా పని చేస్తున్నారన్నారు. నాణ్యమైన, రైతుకు అవసరమైన వరి విత్తనాలు అందించడంలో ఆర్‌బీకేలు ముందున్నాయన్నారు. సర్పంచ్ లోతుగెడ్డ రవికుమార్, రైతులున్నారు. లివిరి రైతు భరోసా కేంద్రం వద్ద సొసైటీ చైర్మన్ గెల్లంకి రమేష్, డైరెక్టర్ కాగితాపల్లి కృష్ణారావు రైతులకు వరి విత్తన బస్తాలు అందించారు. ఏఏ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మకం చేపట్టారు. పార్టీ నాయకులు బౌరి త్రినాద్, పొట్నూరు వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

నిధులున్నా... పనులు చేయకపోవడమేమిటి!

● ఈఓను ప్రశ్నించిన ఎమ్మెల్యే కళావతి



వీరఘట్టం పంచాయతీ ఈఓతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: వీరఘట్టం మేజరు పంచాయతీలో నాలుగు సచివాలయాల పరిధిలో అభివృద్ధి పనులు చేసేందుకు రూ.80 లక్షలున్నా పనులు ఎందుకు చేయడం లేదని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఈఓ రామచంద్రరావును గురువారం ప్రశ్నించారు. నాలుగు నెలల క్రితం ఈ సచివాలయాల పరిధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పలు వీధుల్లో సమస్యలను గుర్తించామని, వాటిలో ప్రాధాన్యత ఉన్న పనులు చేపట్టేందుకు ప్రతీ సచివాలయానికి ప్రభుత్వం రూ.20 లక్షలు నిధులు మంజూరు చేసిందన్నారు. మరి ఈ నిధులు ఎందుకు వినియోగించడం లేదు, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన పనులు వెంటనే చేపట్టాలని ఎమ్మెల్యే కళావతి ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారని, ప్రభుత్వం నుండి ప్రతీ కుటుంబానికి అందుతున్న సంక్షేమ పథకాలను తెలియజేయడంతో పాటు గ్రామాల్లో గుర్తించిన సమస్యలను పరిష్కరించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే అన్నారు. వీరఘట్టం ప్రధాన రహదారి అభివృద్ధి పనులు వేగంగా అయ్యేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

నీట్‌లో అనూష ప్రతిభ



అనూష

గరుగుబిల్లి: మండలంలోని చిలకాం పంచాయతీ కారివలస గ్రామానికి చెందిన బడే అనూష నీట్ 2023లో 720మార్కులకుగాను 573 మార్కులు సాధించి ప్రతిభను కనబరిచింది. ఈమె ర్యాంక్ సాధించడం పట్ల తల్లిదండ్రులు బడే వెంకటనాయుడు, భవానీతో పాటు పలువురు అభినందించారు.

గిరిజన విద్యా సంస్థల్లో తనిఖీలు

సీతంపేట: ఐటీడీఏ పరిధిలోని పాఠశాలలు, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాలను రెండు రోజుల పాటు తనిఖీ చేయాలని ఐటీడీఏ పీవో కల్పనాకుమారి అధికారులను ఆదేశించారు. దీనిలో భాగంగా మొత్తం 263 విద్యా సంస్థలకు అధికారులు వెళ్లి బుధ, గురువారాల్లో తనిఖీలు చేశారు. ఆయా పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది హాజరు వంటి వాటిపై నోట్ క్యామ్‌లో ఫొటోలతో పాటు స్థితిగతులపై నివేదికలు అందించారు.

వృద్ధులను గౌరవించాలి



హోంలో మాట్లాడుతున్న వక్తలు

పాలకొండ రూరల్: వృద్ధులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సామంతుల దామోదరరావు అన్నారు. ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక బాలగోపాల లక్ష్మీ నరసమ్మ ఓల్డేజీ హోంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు, కూరాకుల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ వృద్ధులకు అందించే సేవ భగవంతునికి అందించినట్లు భావించాలన్నారు. వారిని అక్కున చేర్చుకుని ఆప్యాయతను అందించాలన్నారు. కార్యక్రమానికి హెల్పేజ్ ఇండియా, ఎల్డర్ లైన్, హర్షావెల్లి తదితర సంస్థలు తమవంతు సహకారం అందించాయి.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పాలకొండ: పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులు గురువారం ధర్నా చేశారు. కొనేళ్లుగా ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో నగర పంచాయతీలో పని చేస్తున్న కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేయాలని కోరారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మన్యం జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు పాల్గొన్నారు.



నగర పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

సమస్యల పరిష్కారమే లక్ష్యం



యు.వెంకమ్మపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కళావతి

● ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: గ్రామాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని యు.వెంకమ్మపేట, సి.ఎస్.ఆర్.పేట గ్రామాల్లో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కళావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ సమస్యలను వివరించారు. కొత్తగా ఏర్పడిన ఈ పంచాయతీలో రోడ్లు అధ్వాన్నంగా ఉందని, అంగన్‌వాడీ భవనం నిర్మించాలని, మరమ్మతులకు గురైన ప్రాథమిక పాఠశాలను బాగుచే యించాలని, పశువైద్య కేంద్రంనిర్మించాలని కోరారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మించాలని, పంచాయతీ కార్యాలయ భవనాన్ని నిర్మించాలని ఇలా పలు సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యే కళావతి దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను వెంటనే ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కొత్త పంచాయతీలో అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తమ గ్రామం కొత్త పంచాయతీగా ఏర్పడడంతో సహకరించిన ఎమ్మెల్యే కళావతిని సర్పంచ్ సొంట్యాన లక్ష్మి, సింహాచలంతో పాటు గ్రామస్తులు సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, చిదిమి సర్పంచ్ దమలపాటి ఉమామహేశ్వరరావు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పి.సుజాత, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, అధికారులు పాల్గొన్నారు.

విత్తనాల్లో నాణ్యత తప్పనిసరి



గురండిలో విత్తన శ్యాంపిల్స్ సేకరిస్తున్న ఏడీ రత్నకుమారి, ఏఓ సింహచలం

భామిని: రైతులకు అమ్మకం చేసే వరి విత్తనాలు నాణ్యత గల గుర్తింపు పొందిన కంపెనీలవై ఉండాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు కె.రత్నకుమారి సూచించారు. మండలంలోని గురండి, సింగిడి విత్తన వ్యాపారుల వద్ద విత్తనాల నిల్వలను ఎంఏఓ కొర్సు సింహచలంతో కలిసి గురువారం పరిశీలించారు. నిల్వ చేసిన వరి విత్తనాల శ్యాంపిల్స్ సేకరించారు. రైతులకు అమ్మకం చేసిన సీడ్స్‌కు విధిగా బిల్లులు ఇవ్వాలన్నారు. అనంతరం ఘనసర ఆర్‌బీకేలో వ్యవసాయ సహాయకుల సమావేశం ఏర్పాటు చేసి వైఎస్సార్ రైతు భరోసా అందని రైతుల వివరాలు తెలుసుకొని, వాటికి పరిష్కరించే విధానాన్ని ఏడీ రత్నకుమారి వివరించారు. మండలంలో 124 మంది రైతులకు భరోసా అందలేదని గుర్తించారు. ఇంకా అవసరమైన వరి విత్తనాల వివరాలు సేకరించారు. సమావేశంలో వ్యవసాయ సహాయకులున్నారు.

వ్యవసాయ రుణాలు రెన్యువల్స్ చేసుకోవాలి



పీఏసీఎస్‌లో రికార్డులు పరిశీలిస్తున్న బ్రాంచ్ మేనేజర్ పార్వతి

వీరఘట్టం: స్థానిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నుండి తీసుకున్న రుణాలు రైతులు వెంటనే రెన్యువల్స్ చేసుకోవాలని పీఏసీఎస్ బ్రాంచ్ మేనేజర్ ఎస్.పార్వతి సూచించారు. స్థానిక పీఏసీఎస్‌లో రైతు రుణాలకు సంబంధించిన రికార్డులు గురువారం పరిశీలించారు. రెండేళ్లలో ఈ సొసైటీ పరిధిలో ఉన్న 3,742 మంది రైతులకు దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలను రూ.20 కోట్ల వరకు ఇచ్చామన్నారు. వివరాలకు సొసైటీని సంప్రదించాలని కోరారు. ఆమెతో పాటు అసిస్టెంట్ మేనేజర్ క్రాంతి కుమార్ తదితరులున్నారు.

సీఎం జగనన్నతోనే సంక్షేమ పాలన

● ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి



పులిగుమ్మిలో పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

కొమరాడ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని వన్నాం, పులిగుమ్మి, చెక్కవలస గ్రామాల్లో మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలతో కలసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా.. లేదా అని ప్రజలకు అడిగి తెలుసుకున్నారు. మహిళలకు చేయూత, ఆసరా, అమ్మ ఒడి, చేదోడు లాంటి అద్భుతమైన పథకాలు అర్హులందరికీ అందుతున్నాయన్నారు. పార్టీలకతీతంగా పక్షపాతం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు ఇస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ ప్రభుత్వమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బావుజీనాయుడు, ఎంపీపీ శెట్టి శ్యామల, జడ్పీటీసీ డి.ద్వారపురెడ్డి లక్ష్మీ, మండల కన్వీనర్ డి.జనార్దనరావు, సీనియర్ నాయకులు శెట్టి మధుసూదనరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు పి.గోపాలకృష్ణ, మండల సచివాలయ కన్వీనర్ ఏగిరెడ్డి సింహాచలం, సర్పంచ్ మాదలింగి విజయ, ఉప సర్పంచ్ రామారావు పలు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆయుష్‌మాన్ భారత్ సర్వే



మాట్లాడుతున్న ఎంపీడీఓ

పాలకొండ రూరల్: ప్రజారోగ్య భద్రతలను దృష్టిలో పెట్టుకుని నేటి నుండి రెండు రోజులు మండల పరిధిలో ఆయుష్‌మాన్ భారత్ పేరిట ఇంటింట సర్వే చేపట్టనున్నట్లు ఎంపీడీఓ డొంక త్రినాథులు తెలిపారు. తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర స్థాయి వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంబంధిత ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ వినోద్ మాట్లాడుతూ సర్వే చేసేందుకు నిర్దేశించిన ఈ బృందాల సభ్యులు ప్రతి ఇంటికి వెళ్లి సర్వే పూర్తి చేయాలన్నారు. ఈ క్రమంలో ఆయా కుటుంబాలకు ప్రత్యేక కార్డులు మంజూరు చేయనున్నట్టు తెలిపారు. సమావేశంలో వైద్యులు కె.చిరంజీవి, వి.కమల్‌నాథ్, ఉపాధి ఏపీఓ సూరమ్మ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువుల కొరత రాకూడదు : ఎంపీపీ



మాట్లాడుతున్న ఎంపీపీ శెట్టి శ్యామల

కొమరాడ: ఖరీఫ్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విత్తనాలు, ఎరువులు అవసరమైన మేరకు ఆర్‌బీకేల వద్ద ఉంచాలని ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మీ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. సంబంధిత అధికారులు శాఖల వారీగా తమ నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ కొమరాడ జూనియర్ కళాశాల జంక్షన్ నుంచి చినఖేర్జిల వైపు వెళ్లే రహదారిపై అక్రమార్కులు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థికి విద్యా కానుక, గోరుముద్ద కచ్చితంగా అందజేయాలన్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఫణీష్ మాట్లాడుతూ ప్రస్తుతం నిర్మాణాలు జరిగిన భవనాలకు పెండింగ్ బిల్లులు చెల్లింపులు జరిగాయని, భవన నిర్మాణాలు వేగవంతం చేయాలని సభ్యులను కోరారు. సమావేశంలో తహసీల్దార్ రాధాకృష్ణ, ఏపీఓ బాలకృష్ణ, వైస్ ఎంపీపీలు నంగిరెడ్డి శరత్‌బాబు, కేంద్రక అన్నపూర్ణ, కొమరాడ, శివిని పీఏసీఎస్ అధ్యక్షులు మరడాన సూరపునాయుడు, పప్పల గోపాలకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సకాలంలో పనులు పూర్తి చేయకుంటే చర్యలు



ఆస్పత్రి నిర్మాణాలపై కాంట్రాక్టర్‌ను ప్రశ్నిస్తున్న పీవో కల్పనాకుమారి

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రికి నిర్మిస్తున్న అదనపు భవనాల పనులు సకాలంలో పూర్తి చేయకపోతే చర్యలు తప్పవని ఐటీడీఏ పీవో కల్పనాకుమారి కాంట్రాక్టర్‌కు హెచ్చరించారు. ఆస్పత్రి అదనపు భవనాల నిర్మాణాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూలై 1 నాటికి మొదటి బ్లాక్ పూర్తి చేయాలన్నారు. పనుల్లో నాణ్యత పరిశీలించి నివేదిక అందించాలని ఈఈ సింహాచలంకు ఆదేశించారు. అనంతరం సీతంపేట మినీ గురుకులాన్ని తనిఖీ చేశారు. మరుగుదొడ్లకు తలుపులు ఏర్పాటు చేయాలని సూచించారు. తక్కువ మంది విద్యార్థులు వచ్చినా సరే తరగతులు ప్రారంభించాలన్నారు. అనంతరం దోనుబాయి పీహెచ్‌సీని పరిశీలించారు. రికార్డులు పరిశీలించి అసంతృప్తి చెందారు. దీనిపై డిప్యూటీ డీఎంహెచ్‌కు విచారణ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



రెల్లివీధిలో రక్తపూతలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

పాలకొండ రూరల్: వర్షాకాల సీజన్‌లో విజృంభించే వ్యాధులపై అవగాహన పెంచుకుని అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారిని వెన్నెల అన్నారు. పాలకొండ పట్టణ పరిధి రెల్లివీధిలో వ్యాధులపై అవగాహన కార్యక్రమం గురువారం చేపట్టారు. సీజన్‌లో వచ్చే జ్వరాలు, మలేరియా, అతిసార వంటి వ్యాధుల లక్షణాలు, నివారణా మార్గాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా రక్తహీనత వల్ల కలిగే అనర్థాలపై చైతన్యవంతులై మెలగాలన్నారు. పౌష్టికాహార ఆవశ్యకతను తెలియజేశారు. పలువురి నుండి రక్త పూతలు సేకరించారు. కార్యక్రమంలో హెల్త్ సహాయకులు రామశేషు, అంగన్‌వాడీ బి.అమరవేణి, ఆశా కార్యకర్త కె.గౌరీశ్వరి తదితరులు పాల్గొన్నారు.